ప్రజాశక్తి

బుధవారం 23 అక్టోబర్ 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు

ఉచిత గ్యాస్ సిలిండర్ల లబ్ధిదారుల

ఎంపికపై అస్పష్టత

- మార్గదర్శకాలు రాలేదంటున్న అధికారులు
- బియ్యం కార్డు ప్రమాణికంగా అమలుకు అవకాశం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల పథకం ఈనెల 31న అమలులోకి రానుంది. అయితే ఈ పథకంలో ఎంత మందికి లబ్ధి చేకూరనుందనే అంశంపై స్పష్టత లేదు. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు మార్గదర్శకాలు రాలేదని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం కేంద్రం నుంచి నామమాత్రపు సబ్సిడీ పొందుతున్న వారికి ఉచిత సిలిండర్లు ఇస్తారా? లేదా ఇతర మార్గదర్శకాలు ఏమైనా విడుదల చేస్తారా? అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

మరోవైపు ఉచితం ఎవరికి వర్తింప చేస్తారన్న అంశంపై గ్యాస్ కనెక్షన్ దారుల్లో చర్చ ప్రారంభమైంది. తొలుత ఉజ్వల పథకం ద్వారా సిలిండర్లు తీసుకున్న వారికేనని ప్రచారం జరిగింది. ఆ తర్వాత దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు పొందిన వారికి వర్తింపజేస్తారని చెబుతున్నారు. అయితే అంతిమంగా బియ్యం కార్డులున్న వారందరికీ అమలు చేయాలని టిడిపి నాయకుల నుంచి వత్తిడి వస్తోంది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఎవరికైతే సబ్సిడీ వంట గ్యాస్ సిలిండర్లు గతంలో ఇచ్చిందో వీరందరికి ఇవ్వాలని యోచిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

గత పదేళ్లలో గ్యాస్ సిలిండర్లపై సబ్సిడీని గణనీయంగా తగ్గిస్తూ వచ్చారు. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీ కేవలం రూ.14.88పైసలు మాత్రమే వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో జమవుతోంది. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.826 ఉంది. డెలివరీ ఛార్జీలు కలిపి వినియోగదారులు ప్రస్తుతం రూ.860 చెల్లిస్తున్నారు. ఒక్కో సిలిండర్‌పై రూ.851 రాయితీ జమ చేయాలని ఉన్నతాధికారులు ప్రభుత్వానికి సూచించినట్టు తెలిసింది. ఈ నెల 24 నుంచి బుకింగ్ చేసుకున్న వారికి 31 నుంచి సిలిండర్ల సరఫరా అవుతుందని చెబుతున్నారు. సిలిండర్ డెలివరీ అయిన తరువాత రెండో రోజుల్లో సంబంధిత లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతుందని చెబుతున్నారు. ఈ విధంగా ఏడాదికి మూడు సార్లు అవకాశం ఇస్తారు. ఎల్‌పిజి కనెక్షన్లు ఉన్న ప్రతి ఒక్కరికీ అవకాశం ఇస్తామని సిఎం చంద్రబాబు సోమవారం వెలగపూడిలో జరిగిన సమీక్షల్లో చెప్పినట్లు వార్తలు వచ్చాయి.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో సబ్సిడీ గ్యాస్ కనెక్షన్లు 14.40 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. సబ్సిడీయేతర కనెక్షన్లు లక్ష వరకు ఉన్నాయి. రాష్ట్రం మొత్తం మీద కోటి ఐదు లక్షల మందిని గుర్తించగా జిల్లాలో దాదాపు 11 లక్షల మందిని గుర్తించినట్టు తెలుస్తోంది. దీనికి ప్రాతిపదిక ఏమిటన్నదీ స్పష్టత రాలేదు. ప్రస్తుతం గృహ వినియోగానికి వినియోగించే గ్యాస్ సిలిండర్లు వాణిజ్య సంస్థలు కూడా వినియోగిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. వీటిపై విజిలెన్సు అధికారులు అడపాదడపా దాడులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న కనెక్షన్లలో వాస్తవ లబ్ధిదారులను గుర్తింపుపై కసరత్తు చేయాల్సి ఉందని, ప్రభుత్వం తమకు ఇంకా మార్గదర్శకాలు విడుదల చేయాలని జిల్లా సరఫరా అధికారి కోమలి పద్మ తెలిపారు. మరో కొద్ది రోజుల్లో మార్గదర్శకాలు వస్తాయని భావిస్తున్నారు.

మృత్యువుతో పోరాడి ఓడిన యువతి

- ప్రేమికుడి చేతిలో దాడికి గురైన నర్సు సహన మృతి
- బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు నేడు జగన్ రాక

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

తెనాలిలో ప్రేమికుడి చేతిలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్‌డెడ్ అయి మూడ్రోజులపాటు మృత్యువుతో పోరాడిన మధిర సహన (25) మంగళవారం సాయంత్రం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందారు. ఈ ఘటన జిల్లాలో కలకలం రేపింది. నిందితుడు రాగి నవీన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల దర్యాప్తులో పలు సంచలన విషయాలు వెలుగుచూశాయి. వీరిద్దరి మధ్య ఆరేళ్లుగా ప్రేమ వ్యవహారం నడుస్తోంది. ప్రస్తుతం సహన గర్భవతి అని తెనాలి డిఎస్‌పి తెలిపారు. ఈ అంశంపై ఆమె నిలదీయడంతోనే నవీన్ ఆమెను గట్టిగా కొట్టినట్టు పోలీసులు భావిస్తున్నారు. ఈనెల 19న మృతురాలి తల్లి అరుణ పోలీసులకు ఫిర్యాదు చేయగా విభిన్నకోణాల్లో దర్యాప్తు చేసిన పోలీసులు పలు అంశాలను కనుగొన్నారు. వల్లభాపురానికి చెందిన నవీన్ తన కారులో ఈనెల 19న సాయంత్రం 6.30 గంటలకు సహనను తీసుకువెళ్లాడు. కటేవరం ఊరు బయట ఆమెను నవీన్ కొట్టడంతో ఆమె కళ్లు తిరిగి పడిపోయింది. ఆమెను అక్కడ నుండి తీసుకొచ్చి తెనాలి హెల్త్ హాస్పిటల్‌లో చేర్పించి, మృతురాలి తల్లి అరుణకు ఫోన్‌లో సమాచారం ఇచ్చి నవీన్ అక్కడి నుండి పారిపోయాడు. నిందితుడు నవీన్‌కు మరో ఇద్దరు సహకరించినట్టు తెలిసింది.

బాధితురాలికి బ్రెయిన్‌లో రక్తస్రావం అవుతుండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రికు, ఆ తర్వాత గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తన కుమార్తెకు నవీన్‌కు మధ్య కొంత కాలంగా వివాదాలు జరుగుతున్నాయని, ఆమెను నవీన్ కొట్టి గాయపర్చాడని అరుణ ఫిర్యాదులో పేర్కొన్నారు. నవీన్‌ను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఇద్దరి మధ్య ప్రేమ వ్యవహారంపై పెద్దలకు ఇష్టం లేదని డిఎస్‌పి జనార్ధనరావు విలేకర్లకు తెలిపారు. బాధితురాలు కొంత డబ్బులు, వారి ఇంట్లో తెలియకుండా నవీన్‌కు ఇచ్చినట్లు, వాటిలో కొంత భాగం అతను తిరిగి ఆమెకు ఇచ్చాడని, ఈ అంశంలో కూడా ఘర్షణలు జరిగాయని అన్నారు. గర్భం విషయంలో నవీన్‌ను నిలదీయడంతో ఘర్షణ జరిగిందని, ఆమె తలను కారు డోరుకేసి గట్టిగా కొట్టాడని డీఎస్పీ తెలిపారు. బాధిత కుటుంబాన్ని వైసిపి నాయకులు విడదల రజని, మోదుగుల వేణుగోపాలరెడ్డి, డైమండ్ బాబు, మేరుగ నాగార్జున, అప్పిరెడ్డి మంగళవారం రాత్రి పరామర్శించారు. బుధవారం ఉదయం బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ సిఎం జగన్ గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి రానున్నట్టు వైసిపి నాయకులు తెలిపారు.

న్యాయం కోరుతూ బివిఆర్‌కు ఎసిసి కార్మికుల వినతి

5 లో

రేపటి నుండి వర్సిటీలో యువజనోత్సవాలు

8 లో

రాజధాని అమరావతి రైతుల ప్రత్యామ్నాయ ప్లాట్లకు

నేడు, రేపు 'ఈ-లాటరీ'

ప్రజాశక్తి - తుళ్లూరు

ప్రజా రాజధాని అమరావతి నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సిఆర్‌డిఎ) పరిధిలోని భూ సమీకరణ పథకంలో భూములను ఏపీ సిఆర్‌డిఎకు అప్పగించి ఇంకా ప్రత్యామ్నాయ ప్లాట్లు పొందాల్సిన రైతులకు కేటాయించిన నివేశన, వాణిజ్య ప్లాట్లకు బుధ, గురువారాల్లో ప్రత్యామ్నాయ ప్లాట్లకు ఈ - లాటరీ జరుగుతుందని సిఆర్‌డిఎ కమిషనర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతిలో సుమారు 20 గ్రామాలలో రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయిస్తారని తెలిపారు. రైతులకు ప్రతిరోజూ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విజయవాడ లెనిన్ సెంటరులోని సిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో 20 గ్రామాలకు సబంధించి 129 రైతులకుగాను 319 ప్లాట్లకు ఈ-లాటరీ ఉంటుందని పేర్కొన్నారు. 23న కురగల్లు - 1, 2 (మధ్యాహ్నం 2 నుండి 3 గంటల వరకు), అబ్బరాజుపాలెం, ఐనవోలు, లింగాయపాలెం, మల్కాపురం, ఉద్దండరాయునిపాలెం (మధ్యాహ్నం 3 నుండి 4 గంటల వరకు), శాఖమూరు, తుళ్లూరు - 1, 2, మందడం - 1, 2 (సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు, 24వ తేదీన నవులూరు - 1, 2, నిడమర్రు - 1, 2 (మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు), బోరుపాలెం, రాయపూడి -1, నెక్కల్లు, నేలపాడు, వెలగపూడి, వెంకటపాలెం, అనంతవరం (సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు) ఈ-లాటరీ జరుగుతుందని కమిషనర్ వివరించారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

దీపావళి సందర్భంగా బాణసంచా తయారీ కేంద్రాలు, నిల్వ చేసే గోడౌన్స్, విక్రయించే దుకాణాలకు తప్పనిసరిగా అనుమతి ఉండాలని జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసు అధికారులు, ఫైర్ డిపార్ట్మెంట్ సూచించిన నిబంధనలు, జాగ్రత్తలను షాపు నిర్వాహకులు పాటించాలని కోరారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాణసంచా సామగ్రి తయారీ, నిల్వ కేంద్రాలు నివాస ప్రాంతాలకు నిర్దిష్ట దూరంలో ఉండాలని, అధికారులు సూచించిన ప్రదేశాల్లోనే బాణాసంచా విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జనావాసాలకు, విద్యా సంస్థలకు, హాస్పిటల్స్‌కు దూరంగా బాణ సంచా విక్రయాలు ఉండాలని పేర్కొన్నారు. దుకాణాల మధ్య నిర్దిష్ట దూరం ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలని, ప్రతీ దుకాణం వద్ద రెండు అగ్ని నిరోధక సిలెండర్లు, రెండు బక్కెట్ల పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

5 జిల్లాల ఎస్పీలతో ఐజి సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు రేంజి పరిధిలోని ఐదు జిల్లాల్లో పెరుగుతున్న సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠి ఆదేశించారు. గుంటూరులోని రేంజి కార్యాలయంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఎస్‌పిలతో మంగళశారం ఆయన సమీక్షించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసే వారిని అరికట్టాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శాంతిభద్రతల సమస్యల పరిష్కారం కోసం నిరంతర నిఘా పెంచాలని, తీవ్రమైన నేరాలు సంబంధిత కేసులు గురించి రౌడీషీటర్లపై నిఘా ఉంచి వారి కార్యకలాపాలను అణిచివేయాలని, ముఖ్య ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటి పనితీరును సమీక్షించాలని చెప్పారు. కేసు దర్యాప్తుల్లో ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని దర్యాప్తు వేగం పెంచాలన్నారు. కమ్యూనిటీ ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. సమీక్షలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఎస్పీలు ఎస్.సతీష్‌కుమార్, కె.శ్రీనివాసరావు, తుషార్ దూడి, ఇ.దామోదర్, ఎస్‌పి కృష్ణకాంత్ పాల్గొన్నారు.

పథకాల అమలుపై కేంద్ర బృందం పరిశీలన

ప్రజాశక్తి - క్రోసూరు

కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్వహిస్తున్న పనులు పర్యవేక్షణకుగాను కేంద్ర బృందం మండలంలోని నాగవరం, గరికపాడు, 88 తాళ్లూరు గ్రామాలను మంగళవారం సందర్శించింది. డ్వాక్రా మహిళలు, ఉపాధి హామీ కూలీలు, సచివాలయ సిబ్బందితో సభ నిర్వహించారు. 15 ఆర్థిక సంఘం నిధులు, ఉపాధి హామీ పనులు, పింఛన్లు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎన్ఎల్ఎం టీం అధికారి శ్రీరాములురెడ్డి, డ్వామా పీడీ ఎం.సిద్ధమూర్తి, డిఆర్‌డిఎ పీడీ బాలు నాయక్, ఎంపిడిఒ మహేష్‌బాబు పాల్గొన్నారు.

ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి నూతన పాలకవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి నూతన పాలకవర్గాన్ని సంఘ సభ్యులు, పెద్దలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చర్చ్ అధ్యక్షులుగా విశ్రాంత ఉపాధ్యాయులు చాట్ల రామయ్య, ఉపాధ్యక్షులుగా దారి వేముల మోజస్ నాగ స్వామి, కార్యదర్శిగా గద్దల ఆశీ వరప్రసాద్ వందనం, ఉప కార్యదర్శిగా కూచిపూడి వినోద్, కోశాధికారిగా పులిమల సునీల్ కుమార్ ఎన్నికయ్యారు. పాలకవర్గ సభ్యులుగా బెజవాడ ఫ్రాన్సిస్, కొండముట్ల పథ్వీరాజు, పచ్చి గొర్ల ప్రభాకర్, నందిగం ఏసుదాసు, మంద మోషే, బీర్నేడి సంతోష్, జార్జి విన్సెంట్ ,కంభంపాటి నాగేశ్వరరావు, కట్టెంపూడి లింకన్, ప్రదీప్ ఎన్నికయ్యారు.

ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో భోజనం

ప్రజాశక్తి - నాదెండ్ల

ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో రొటేరియన్ తియ్యగూర కోటిరెడ్డి వర్ధంతి సందర్భంగా మండలంలోని కనపర్రు నైస్ పాఠశాలలో 200 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. కోటిరెడ్డి భార్య రమాదేవి, కుమారులు యస్వంత్‌రెడ్డి, ఉమేష్‌రెడ్డి ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమం చేపట్టామని క్లబ్ అధ్యక్షులు జి.సరోజిని తెలిపారు. రోటరియన్ కారుమంచి శివరావు భార్య సరళాదేవి వర్ధంతి సందర్భంగా చిలకలూరిపేటలోని బాపూజీ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఆశ్రమానికి 2 క్వింటాళ్ల బియ్యం, 10 కిలోల కందిపప్పు అందజేశారు. కార్యక్రమాల్లో కె.సాంబశివరావు, సుబ్బారావు, ప్రిన్సిపాల్ గణపతి, ఎన్.జయలక్ష్మి, డి.రమాదేవి, టి.విశాలి, డి.బుజ్జిబాబు, ఆశ్రమ నిర్వాహకులు ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

ఎలుకల వల్ల పంట నష్టం 10-40 శాతం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట మండలం పమిడిపాడులో జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళి, జిల్లా ఉద్యన అధికారి రమణారెడ్డి, శాస్త్రవేత్త నగేష్, ఎపిఎంఐపి పీడీ ఆంజనేయులు, డిడిఎ శివకుమారి, డిపిఎం అమలకుమారి, ఎడిఎ మస్తానమ్మ, ఏఓ నరేంద్రబాబులతో కలిసి సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వరి వంటి ప్రధాన పంటల్లో ఎలుకల సమస్య ఎక్కువుగా ఉంటోందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి మాట్లాడుతూ ఎలుకల వల్ల రైతులకు పెద్ద ఎత్తున నష్టం కలుగుతోందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం సామూహిక ఎలుకల నివారణకు అవసరమైన బ్రోమోడయోలిన్ మందును 100 శాతం రాయితీపై సరఫరా చేస్తోందని చెప్పారు. విషపు ఎరను ఏ విధంగా తయారు చేసుకోవాలో రైతులకు వివరించారు. పొలం గట్లపై ఎలుక బొరియలో మందు పొట్లం పెట్టే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.శ్రీనివాసరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ అధికారులు సూచన మేరకు రైతులు సాగు చేపట్టి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని పమిడిమర్రు సర్పంచ్ దాసరి సుధారాణి శ్రీనివాసరావు అన్నారు. నరసరావుపేట మండలంలోని పమిడిమర్రులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు సదస్సు మంగళవారం నిర్వహించారు. పత్తి, మిర్చి, వరి పొలాలను పరిశీలించిన అనంతరం గ్రామంలో సర్పంచ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతు సదస్సులో జిల్లా వనరుల కేంద్రం శివకుమారి మాట్లాడుతూ భూసార స్థితిగతుల ఆధారంగా ఎరువుల వినియోగం ఉండాలని, రసాయనిక ఎరువుల అధికంగా వాడకం వల్ల భూసారం దెబ్బ తింటుదని చెప్పారు. అధిక నత్రజని వాడకం వల్ల పురుగులు ఎక్కువగా ఆశిస్తాయని, తెగుళ్ల ఉధృతంగా వస్తాయన తెలిపారు. వరిలో పొటాష్ వాడే సందర్భంలో దానిని రెండు భాగాలుగా చేసి ఒక భాగం దమ్ములో, రెండవ భాగం చిరుపొట్ట దశలో వేసుకోవాలన్నారు. నారును నాటే ముందు నారు కొసలు తుంచి నాటుకోవాలన్నారు. కలుపు నివారణను సమర్ధవంతంగా చేపట్టాలన్నారు. పంట లేని సమయంలో పురుగులు, తెగుళ్ల కలుపు నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఆకు ముడుతను తెగులు నివారణకు క్లోరిఫైరిఫాస్ 25 మిల్లీ లీటర్లు, లేదా ఎసిఫెట్ 1.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎడిఎ పి.మస్తానమ్మ, మండల వ్యవసాయ శాఖ అధికారి వి.నరేంద్రబాబు, రైతులు పాల్గొన్నారు.

రొంపిచర్ల మండలంలో విప్పర్లపల్లి, వడ్లమూడివారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి శివలలిత, వ్యవసాయ శాఖ సిబ్బంది వరి పొలాలను సందర్శించి పంట సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. 5 కిలోల నూకలలో 200 గ్రాముల నూనె, 200 గ్రాముల బ్రమోడియోలిన్ కలిపి బైట్‌గా తయారు చేసి ఎలుక నివారణ మందుగా పంపిణీ చేశారు. పశువైద్యాధికారి డాక్టర్ వంశీ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధి హామీ కింద పశుగ్రాసం సాగు చేసే పశుపోషకదారులకు కిసాన్ కార్డులున్నాయని చెప్పారు. పశుపోషకదారులలు తమను సంప్రదించి కిసాన్ కార్డులు తెచ్చుకోవాలన్నారు.

నిర్మూలనకు ఉచితంగా మందు

ప్రజాశక్తి - ఈపూరు

ఎలుకల నుండి పంటలను కాపాడుకునేందుకు ప్రభుత్వం ఉచితంగా బ్రోమోడయోలిన్ మందును అందజేస్తుందని మండల వ్యవసాయాధికారి ఆర్,.రామారావు అన్నారు. మండలంలోని 12 రైతుసేవా కేంద్రాల్లో బ్రోమోడయోలిన్ మందు అందుబాటులో ఉందన్నారు. బొమ్మరాజుపల్లి గ్రామ రైతుసేవ కేంద్రంలో నూకలు, బ్రోమోడయోలిన్, శనగ నూనె (నూకలు 96 శాతం, మందు 2 శాతం, శనగ నూనె 2 శాతం) మిశ్రమంతో మందు ఎలా తయారు చేయాలో రైతులకు వివరించారు. ఎలుకల నివారణకు ఆ మందును రంధ్రాల వద్ద 10 గ్రాముల చొప్పున పెట్టాలన్నారు. అనంతరం ఈపూరులో పొలం పిలుస్తోందిలో భాగంగా వరి పొలాలను పరిశీలించారు. ఆకు చుట్టు, అగ్గి తెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఎఇఒ బి.అప్పారావు, వ్యవసాయ శాఖ సహాయకులు సల్మా, శేషుబాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నాదెండ్ల

సామూహిక ఎలుకల నివారణంపై మండలంలోని సాతులూరులో మంగళవారం అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి ఎ.హరిప్రసాద్ మాట్లాడుతూ ఎలుకల వల్ల వరిలో 10 నుంచి 40 శాతం వరకు పంట నష్టం జరుగుతుందని, ఈ నష్టం వాటిల్లకుండా ప్రభుత్వ సరఫరా చేసే మందును చిన్నచిన్న ప్యాకెట్లుగా పేపర్‌తో చుట్టి ఎలుక బొరియల్లో జారవిడవటం ద్వారా ఎలుకలను సమర్ధవంతంగా నివారించవచ్చని చెప్పారు. ఈ సందర్భం మందును సర్పంచ్ ఎం.శోభారాణి ద్వారా రైతులకు అందజేశారు. వెటర్నరీ డాక్టర్ శ్రీలక్ష్మి, ఉప సర్పంచ్ శరభయ్య, ఎఇఒ బి.జీవన్ నాయక్, గ్రామ వ్యవసాయ సహాయకులు రామారావు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని భృగుబండలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా ఎలుకల నివారణ మందును పంపిణీ చేశారు. మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాల నందు సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో వరి సాగు విస్తీర్ణం ఆధారంగా బ్రోమోడయోలీన్ అనే ఎలుకల మందును రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు.

ప్రజాశక్తి - దాచేపల్లి

మండలంలోని నడికూడిలో నిర్వహించిన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.పాప కుమారి మాట్లాడారు. ఎలుకల నివారణపై రైతులకు వివరించారు. భూసార పరీక్ష చేయించుకొని సాయిల్ హెల్త్ కార్డ్ ఆధారంగా ఎరువులను వాడాలని సూచించారు. రసాయనకి ఎరువుల వాడకాన్ని తగ్గించి జీవన ఎరువులు వాడాలన్నారు.

ప్రజాశక్తి - కారంపూడి

మండలంలోని అన్ని గ్రామాల్లో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టారు. బ్రోమొడైల్ మందును రెండున్నర ఎకరాలకు 10 గ్రాముల చొప్పున పంపిణీ చేశారు. ఎకరానికి విషపు ఎర (బైట్) 8 చొప్పున పెట్టాలని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

సామూహిక ఎలుకల నిర్మూలనపై మండలంలోని జలాల్‌పురంలో రైతులకు మండల వ్యవసాయాధికారి శాంతి అవగాహన కల్పించారు. రైతులంతా ఒకేరోజు ఎలుకల మందును పొలాల్లో పెట్టాలని సూచించారు.

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి-చిలకలూరిపేట

నియోజకవర్గంలోని పలువురికి సిఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం స్థానిక తన నివాసంలో అందించారు. చిలకలూరిపేట పట్టణానికి చెందిన పొన్నూరు శ్రీనివాసరావుకు రూ.1,22,799, చిలకలూరిపేట మండలం పసుమర్తికి చెందిన షేక్ గౌసుల్‌కు రూ.67 వేలు కోమటినేనివారిపాలేనికి చెందిన మద్దాల సాంబశివరావుకు రూ.1,09,258, నాదెండ్ల మండలం చిరుమామిళ్లకు చెందిన షేక్ మస్తాన్ బీకి రూ.20 వేలు, నాదెండ్లకు చెందిన కె.కిరణ్ కుమార్‌కు రూ.20,675, కొరివి రాజమ్మకు రూ.2,17,200 తుబాడకు చెందిన షేక్ ముబీనా కుమార్తెకు రూ.1.20 లక్షలు, సాతులూరుకు చెందిన బండారు వెంకట రమణకు రూ.35 వేలు, పాస్టం కళావతికి రూ.23,920, తూబాడుకు చెందిన షేక్ నజీర్‌కు రూ.20 వేలు, నందిగం సుజనబాబుకు రూ.45 వేలు, చెన్ను వెంకట రమణకు రూ.23,920 చొప్పున చెక్కులు అందించారు.

రైతు సేవా కేంద్రాల్లో సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం చేపట్టిన వ్యవసాయ విస్తరణ కార్యక్రమం రైతులకు అండగా నిలుస్తుందని మండల సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్ ఉషారాణి అన్నారు. తెనాలి వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కొలకలూరు, కంచర్లపాలెం, కఠెవరం, బుర్రిపాలెం, పెదరావూరు గ్రామాల్లో రైతులతో కలసి సామూహిక ఎలుకల నివారణ చర్యలను చేపట్టారు. ఎలుకల నివారణకు కావాల్సిన క్రిమి సంహారకాల తయారీ విధానాన్ని వివరించారు. ఎలుక బొరియల్లో మందును ఏ విధంగా పెట్టాలో శాస్త్రీయపద్ధతిలో చేసి చూపించారు. అనంతరం వరి పంటల్లో ఉన్న చీడపీడలు, కాండము తులుచు పురుగుల నివరణపై ఎఒ ప్రేమసాగర్ రైతులకు అవగాహన కల్పించారు. ఎకరా వరి పంటకు 60 మిలీలీటర్ల క్లోరిన్ ట్రినిపోల్ పిచికారి చేసినచో చీడపీడలు నివారించు కోవచ్చని అన్నారు. అలాగే రైతులకు బ్రోమోడయోలిన్ ఎలుకమందు నివారణ మిశ్రమ తయారీ విధానాన్ని వివరించారు. 100 గ్రాముల ప్రోమోడియాల, రెండు గ్రాముల నూనె, 96 గ్రాముల నూకలను మిశ్రమంగా కలుపుకోవాలన్నారు. 10 గ్రాములు మిశ్రమాన్ని పేపర్లో మడతపెట్టి, ఆ ప్యాకెట్లను ఎలుకలు ఉన్న బొరియల్లో పెట్టాలన్నారు. ముందురోజు ఎలుకల రంధ్రాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆ మరుసటి రోజున ఎలుక బొరియల్లో రైతులందరూ కలసి సామూహికంగా పెట్టినట్లైతే ఎలుకలు ఆమందులు తిని చనిపోతాయని, అనంతరం ఎలుకలను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక విఎఎ సంసోనమ్మ, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని చిర్రావూరులో టీడీపి గ్రామ పార్టీ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు, ఆధ్వర్యంలో చిర్రావూరు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం అగ్రికల్చర్ అధికారులు టీడీపి, జనసేన, నాయకులు రైతులకు వరి మినుముల నాట్లలో ఎలుకల నివారణకు ఎలుకల మందును ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరి శెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వరి, మినుముల పంట పొలాలలో రైతులు ఎలకల బెడదను తక్షణము నిర్మూలించుకోవాలని, ఎలకలు పొలం గట్ల పైన, వరి, మినుముల చేలలోను వరి, మినుమల నాట్లను నాశనం చేయకుండా ఉండేందుకు తగు చర్యలు రైతులు వెంటనే తీసుకోవాలని పలు సూచనలతో వ్యవసాయ అధికారులు తెలియజేశారని అన్నారు. రైతులకు వరి నూకలతో కలిపిన ఎలుకల మందుని పంపిణీ చేశారు. తప్పకుండా ఎలుకలను నివారణకు తగు సూచనలు పాటిస్తే దిగుబడి అధికంగా ఉంటుందని, ఏ మాత్రం ఆజాగ్రత్త చేసిన ఎలుకలు కష్టపడి పండించిన పంటను సర్వము నాశనం చేస్తాయని, ఎలుకలను నివారించుట ఒక్కటే మార్గమని అన్నారు. కార్యక్రమంలో టీడీపి జనసేన నాయకులు పోకల శివయ్య, ఏసుబాబు, శంకర్, మురళి, భూషణం, చెన్నయ్య, రాజా, అర్జున్ రావు, అప్పారావు, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, సుబ్బారావు, సుబ్బారావు, సాంబయ్య, అప్పారావు, అగ్రికల్చర్ ఏవో శ్రీనివాస్, అగ్రికల్చర్ అధికారి కే.శాంతి శ్రీ,తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చేబ్రోలు

మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో పొలం పిలుస్తుంది , సామూహిక ఎలుకల నిర్మూలన 'ఎర' తయారీ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ఎలుకల మందును తయారీ విధానము గురించి రైతులకు అవగాహన కల్పించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి బి శ్రీనివాస నాయక్ తెలిపారు. ఎర తయారీ కి 96 పాళ్ళు నూకలు, రెండు పాళ్ళు నూనె, రెండు పాళ్ళు మందు కలిపి విషపు ఎర తయారుచేసి, పేపర్లలో పొట్లాలుగా కట్టి రైతులకు అందించారు. రైతులు తమ పంట పొలాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకుంటూ ఉండాలని , మితంగా పురుగు మందులు వినియోగిం చాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మైలా వెంకట్రామరాజు, ఎం రత్న మంజుల, వి రామకోటేశ్వరి , డాట్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ వెంకట లక్ష్మి రైతులకు పలు సూచనలు చేశారు.

చిర్రావూరులో ఎలుకల మందు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు వీరిశెట్టి శ్రీనివాసరావు

చేబ్రోలులో మందు పంపిణీకి సిద్ధం చేస్తున్న అధికారులు

మీడియాతో మాట్లాడుతున్న నక్కా ఆనందబాబు, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

సహన కుటుంబ సభ్యులకు టిడిపి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెనాలి బ్రెయిన్ డెడ్ యువతి సహన కుటుంబ సభ్యులను మాజీ మంత్రులు ఆలపాటి రాజా, నక్కా ఆనంద్ బాబు మంగళవారం మధ్యాహ్నం పరామర్శించారు. నక్కా ఆనంద్ బాబు మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటన వైసీపీ రాజకీయం చేస్తుందన్నారు. ఆమెను పరామర్శించడానికి మాజీ సీఎం జగన్ రావడం విడ్డూరంగా ఉందన్నారు. గత వైసీపీ హయాంలో జరిగిన దాడులు హత్యలు మరచిపోయాదేమో అనిపిస్తుందన్నారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని చంద్రబాబు నాయుడు సూచించినట్లు తెలిపారు.వైసీపీ ప్రభుత్వం తయారు చేసిన మూలాల ఇంకా బ్రతికే ఉన్నాయని వాటిపై టీడీపీ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సహనకి అన్నిరకాల సహాయక వనరులు సత్వరమే అందిస్తామని హామీ ఇచ్చారు.

మహిళలకు రక్షణ లేదు

మాజీ మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

కూటమీ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి మహిళలకు రక్షణ లేకుండా పోయిందనీ మాజీ మంత్రి విడుదల రజిని ఆరోపించారు. ప్రేమికుడి చేతిలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ కి గుర్రై మృత్యువు తో పోరాడుతూ మంగళ వారం ప్రాణాలు విడిచిన తెనాలి యువతి సహన కుటుంబసభ్యులను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైసిపి నేతలు పరామర్శించారు. మహిళలకు రక్షణ లేదనడానికి సహాన ఘటనే నిదర్శనం అన్నారు.సహాన శరీరంపై గాయాలున్నాయి.బయటకు చెప్పుకోలేని అభద్రతాభావం లో సహన తల్లిదండ్రులు ఉన్నారన్నారు.మహిళలకు రక్షణ లేదన్న భావన వ్యక్తం అవుతోందన్నారు.దిశ లాంటి చట్టాలను జగన్ మోహన్ రెడ్డి తీసుకొచ్చారని, కూటమి ప్రభుత్వం మహిళా రక్షణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి మేరుగ నాగార్జున రాష్ట్రంలో మహిళల హత్యలన్ని ప్రభుత్వ హత్యలేనని తెలిపారు. సహనా విషయంలో ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకున్నారో అందరూ చూస్తున్నారని తెలిపారు. తెనాలి, మంగళగిరి మంత్రులు నాదెండ్ల మనోహర్, నారా లోకేష్ ఏమయ్యారని ప్రశ్నించారు ప్రభుత్వం స్పందించాల్సిన రీతిగా స్పందించలేదు.రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది. దిశ యాప్ లేకపోవటం వలన మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు.

అనుమతి లేకుండా టపాసులు తయారు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - చేబ్రోలు

అనుమతి లేకుండా దీపావళి మందు గుండు సామగ్రిని తయారు చేస్తున్న వ్యక్తులను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలో గరువుపాలెం గ్రామంలోని ఒక ఇంటిలో ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ ఇద్దరు వ్యక్తులు ప్రేలుడు పదార్థాలతో నేల టపాసులు తయారు చేస్తున్నారని ఎస్ఐ డి వెంకటకృష్ణ మీడియాకు తెలిపారు. జిల్లా ఎస్ పి ఎస్ .సతీష్ కుమార్ ఆదేశాల మేరకు, తెనాలి డి ఎస్ పి బి .జనార్ధన్ పర్యవేక్షణలో పొన్నూరు రూరల్ సర్కిల్ ఇనస్పెక్టర్ వై . కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ డి .వెంకటకృష్ణ సిబ్బందితో రెండు బృందాలుగా విడిపోయి తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని, మరొక వ్యక్తి తప్పించుకొని పారిపోయాడని తెలిపారు . పట్టుకున్న వ్యక్తిని విచారించగా అతని పేరు బూరగ సైదా అని, శేకూరు గ్రామానికి చెందిన వ్యక్తి అని తెలిపారు. కొద్దీ సంవత్సరాల నుండి దీపావళి పండుగ వచ్చే ముందుగా నేల టపాసులు తయారు చేయడానికి కావలసిన ముడి సరుకులు సేకరించి వాటిని గరువుపాలెం గ్రామంలోని ఒక ఇంటిని అద్దెకు తీసుకొని వాటిని అందులో నిల్వ చేసి, సదరు బూరగ సైదా మరియు అతని స్నేహితుడు నారాకోడూరు గ్రామానికి చెందిన ముప్పవరపు సంజయ్ సారధి ఇద్దరు కలిసి గత 10 రోజులుగా గరువుపాలెం గ్రామం లోని ఇంటిలో ప్రేలుడు పదార్థాలతో నేల టపాసులు తయారు చేస్తున్నామని నిందితుడు తెలియజేశాడని పోలీసులు తెలిపారు. సంఘటన స్థలంలో 20 ప్యాకెట్ల నేల టపాకాయలు, వాటిని తయారు చేయటానికి ఉపయోగించే రాళ్ళు, పేపర్ ముక్కలు, గుడ్డ ముక్కలు మరియు కేజీ తెల్లటి మందును సీజ్ చేశామని తెలిపారు. ఎటువంటి లైసెన్స్ లేకుండా అక్రమంగా పేలుడు పదార్థాలతో నేల టపాకాయలు చేస్తున్నందున వ్యక్తులపై చట్టపరంగా కేసును నమోదు చేయడం జరిగిందని చెప్పారు. పారిపోయిన నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని అన్నారు. ఎవరైనా ఎటువంటి లైసెన్స్ లేకుండా అక్రమంగా ఇటువంటి చర్యలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చేబ్రోలు ఎస్ ఐ డి వెంకట కృష్ణ హెచ్చరించారు. ప్రజలకు ఇలాంటి సంఘటనలు తెలిస్తే వెంటనే తమకు తెలియజేయాలని చెప్పారు.

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), నరసరావుపేట
ఐ.ఏ.నెం. 06/2024 in O.S. No. 37/2020
గోరంట్ల సాయి ప్రసన్న .... పిటీషనర్/వాది
V/s
గోరంట్ల రామాంజనేయులు వగైరాలు
...రెస్పాండెంట్స్/ ప్రతివాదులు
To,
ఆర్15 : నందిగం శ్రీనివాసరావు S/o కొండయ్య, వ్యవసాయము, గుండాలపాడు గ్రామము, ఫిరంగిపురం మండలం, గుంటూరు జిల్లా.
ఆర్20 : పావూరి ఏ ముండ్లమూరి రమ్య W/o ముండ్లమూరి అమర్ నాథ్, డోర్ నెం. 10-5-26/1, అరండల్ పేట, నరసరావుపేట టౌన్, పల్నాడు జిల్లా.
ఆర్22 : పుచ్చకాయల విశాలక్ష్మి W/o శ్రీనివాసు, మున్సిపల్ ఆఫీసు వెనుక, నరసరావుపేట టౌన్, పల్నాడు జిల్లా.
ఆర్23 : వజ్జా నరసింహం S/o వెంకటేశ్వర్లు, లక్కరాజుగార్లపాడు గ్రామము, సత్తెనపల్లి మండలం, పల్నాడు జిల్లా.
ఆర్24 : చల్లా వెంకటరమణ W/o మందూరి సురేష్, సెయింట్ జోసఫ్ స్కూల్ వెనుక, ప్రకాష్ నగర్, నరసరావుపేట టౌన్, పల్నాడు జిల్లా.
ఆర్25: జవ్వాజి నాగ శారద W/o రమేష్, గోగులపాడు గ్రామము, రొంపిచర్ల మండలం, పల్నాడు జిల్లా.
ఆర్28 : యర్రం ఆదిలక్ష్మి W/o సుబ్బారెడ్డి, యర్రావారిపాలెం, కారంపూడి మండలం, పల్నాడు జిల్లా.
పై నెంబరు దావాలో ఐ.ఎ.నెం.06/2024 నెంబరున పిటీషన్ దాఖలు చేయగా, పై కోర్టు వారి నుండి మీకు నోటీసులు జారీ చేయగా మీరు నోటీసులు తీసుకొని కారణముగా ఈ పేపర్ ప్రకటన ద్వారా మీ యొక్క నోటీసు నిమిత్తము ది. 01-11-202455 వాయిదా అయ్యి ఉన్నది. కావున వాయిదా రోజు పై కోర్టు వారి ఎదుట మీరు ది. 01-11-2024 వ తేదీ ఉదయం 10-30 ని॥ లకు, మీరు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని లేదా వకీలు ద్వారాగాని హాజరై మీకు ఆక్షేపణలు ఉన్న తెలుపు కోవలసినది. లేనియెడల, మీ పరోక్షమందు, చట్ట ప్రకారము తీర్మానము చేయబడును. కావున తెలియ జేయడమైనది.
శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు
వాయిదా: 01-11-2024
ఇట్లు.
శ్రీ బి.అనిల్ కుమార్,
పిటీషనరు తరుపు అడ్వకేట్,
నరసరావుపేట.

PASSPORT MISSING
I SHAIK RASOOL S/o BUDE SAHEB (Late) R/o NO:3-32-39, BYPASS ROAD, PEDDA CHERUVU, OPP MAHALAKSHMI NAGAR BOARD, NARASARAOPET, PALNADU DISTRICT, AP-522601. My **Original passport No:'A3792727'** while I was house shifting on 04-06-2024 when I have misplaced my bag I found that my bag missing passport if found anyone contact below address.

విషపు మొక్కలు తిని 12 గొర్రెలు మృతి

ప్రజాశక్తి - కొల్లిపర

విషపు మొక్కలు తిని 12 గొర్రెలు మృతి చెందిన ఘటన కొల్లిపర మండలం తూములూరు గ్రామంలో చోటు చేసుకుంది. తూములూరు గ్రామ శివారు లంబాడి పాలెం చెందిన బాణావత్ రుషి నాయక్ తన గొర్రెలు మేపేందుకు ఖాళీ స్థలంలో వదిలిపెట్టాడు. 10 నిమిషాలకు 12 గొర్రెలు మత్యువాత పడగా రుషి నాయక్ వెంటనే మండల పశు వైద్యశాలకు సమాచారం ఇవ్వగా పశువైద్యాధికారి సంఘటనా స్థలానికి చేరుకొని బ్రతికున్న గొర్రెలకు ప్రథమ చికిత్స లో భాగంగా సూది మందు అందించాడు. మృతి చెందిన గొర్రెలను కొల్లిపర పశు వైద్యశాలకు తరలించి పశువైద్యాధికారి డాక్టర్ సాయి సతీష్ రాజ్ పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టంలో గొర్రెలు విషపు మొక్కలను తినడం వల్ల చనిపోయినాయని తెలిపారు. మృతి చెందిన 12 గొర్రెలు విలువ సుమారు మూడు లక్షలు ఉంటుందని రుషి నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు.

బస్సులో ప్రయాణిస్తున్న మహిళా కాంగ్రెస్ నాయకులు

ఉచిత బస్సు పథకం ఎప్పుడు? : కాంగ్రెస్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఎన్నికల హామీ అయిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు కల్పిస్తారని ప్రభుత్వాన్ని పల్నాడు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు తోట విజయలక్ష్మి ప్రశ్నించారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షేక్ కరిమున్‌తో కలిసి ఆమె ప్రయాణికులతో మాట్లాడారు. యడ్లపాడు వరకు బస్సులో ప్రయాణించారు. అనంతరం విలేకర్లతో విజయలక్ష్మీ మాట్లాడుతూ కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాలు విజయవంతంగా ఉచిత బస్సు పథకాలు అమలు చేస్తున్నాయని, ఏపీ ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తోందని అడిగారు. కార్యక్రమంలో నాయకులు జి.రోజీ, టి.రూత్, టి.కుమారి, ఆర్.పెద్దమ్మాయి, పి.సుభాషిణి, ఎస్.పోలేరమ్మ, పి.బుజ్జి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు జి.అలెగ్జాండర్ సుధాకర్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఆల్ ఇండియా ఫెన్సింగ్ పోటీలకు ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థిని

ప్రజాశక్తి-ఈపూరు

ఈనెల 21వ తేదీన డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఫెన్సింగ్ పోటీల్లో మండలంలోని ఎ.ముప్పాళ్లలోని ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థిని గమిడి సబిత ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకటరావు మంగళవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థిని వచ్చేనెల 6న యూనివర్సిటీ ఆఫ్ జమ్మూలో జరిగే అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థినిని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు ఆర్.బలరాం నాయక్, ఎం.దాసు, సిహెచ్ అరవింద్, వంశీ అభినందించారు.

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటు నమోదు కేంద్రం ప్రారంభం

పజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణ పరిసర గ్రామాలలోని పట్టభద్రులందరూ నవంబర్ 6 వ తేదీలోగా తమ ఎమ్మెల్సీ ఓట్లు నమోదు చేయించుకోవాలని డివైఎఫ్ఐ పల్నాడు జిల్లా నాయకులు జె.రాజకుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం స్థానిక విలేకరుల కాంప్లెక్స్‌లోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో, సత్తెనపల్లి పట్టణం శివారులోని నందిగామ రోడ్డు సెంటర్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కేంద్రాలను ప్రారంభించారు. సత్తెనపల్లి పట్టణ, మండల పరిసర ప్రాంతాల డిగ్రీ పూర్తయిన పట్టభద్రులు ఈ సేవలను వినియోగించుకోవాలని డివైఎఫ్ఐ సత్తెనపల్లి మండల కార్యదర్శి శ్రీనివాసరావు కోరారు.

చనిపోయిన వారికి ఉపాధి హామీ కూలి

ప్రజాశక్తి-ఈపూరు

16వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా మండలంలోని ఎ.ముప్పాళ్ల, కొచ్చర్ల, కొండ్రముట్ల, అగ్నిగుండాల గ్రామాల్లో ఉపాధి హామీ గ్రామసభలు మంగళవారం జరిగాయి. ఉపాధి హామీ కూలీల మస్టర్లలో సంతకాలు, వేలిముద్రలు లేకుండానే వేతనాలు చెల్లించినట్లు గుర్తించారు. కొచ్చర్లలో చనిపోయిన వ్యక్తుల పేర్లతో వేతనాలు చెల్లించారు. కొన్ని పనులకు కొలతలు తీయకుండానే చెల్లించారు. గ్రామ సచివాలయ ఉద్యోగి కుటుంబ సభ్యుల గృహానికి బిల్లులు చెల్లించినట్లు గ్రామ సభలో డిఆర్‌పి వివరించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసే వ్యక్తులకు, స్థానికంగా నివాసం ఉండని వ్యక్తుల పేర్లతో వేతనాలు చెల్లించారని వెల్లడించారు. కొచ్చర్లలో పనికి వెళ్లని వారికి వేతనాలు చెల్లించారని గ్రామసభలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పి జె.ఎస్ రాజు, సర్పంచ్ కె.దేవరాజ్, ఎపిఓ ఎం.లక్ష్మణరావు పాల్గొన్నారు.

వేతనాల చెల్లింపులపై ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తుడు

జీతాల కోసం చెట్టినాడ్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - దాచేపల్లి

జీతాల కోసం మండలలోని పెద్దగార్లపాడులోని చెట్టినాట్ సిమెంట్ కర్మాగారం మెయిన్ గేటు వద్ద కార్మికులు, సూపర్వైజర్లు, సబ్ కాంట్రాక్టర్లు మంగళవారం ధర్నా చేశారు. గత నాలుగు నెలల నుండి వేతనాలు రావాలని, యాజమాన్యం దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి కార్మికులుగా పనిచేస్తున్నామని, ఇప్పటికైనా యాజమాన్యం స్పందించాలని కోరారు. యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కారిస్తామని కాంట్రాక్టర్లు హామీ ధర్నాను విరమించి విధుల్లోకి వెళ్లారు.

పోషకాహారం తింటే పుట్టే బిడ్డలకు గ్రహణ మొర్రి రాదు : డాక్టర్ ఉదయభాను

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

గర్భం దాల్చిన సమయంలో తల్లి తీసుకునే ఆహారం, పోషకాల ప్రభావం పొట్టలోని బిడ్డపై పడుతుందని, గర్భిణులు ఆకుకూరలు, నిమ్మజాతి పండ్లు, బీన్స్, పప్పు ధాన్యాలు, ఫోలిక్ ఆమ్లం సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకొంటే పుట్టబోయే పిల్లలకు గ్రహణం మొర్రి వ్యాధి వచ్చే అవకాశాలు తగ్గుతాయని మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉదయభాను తెలిపారు. చిన్నపిల్లల నోటిలో పుట్టుకతో వచ్చిన సమస్యలు (పెదవి చీలిక, అంగిలి చీలిక) సమస్యల ఉన్నవారికి మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. కృష్ణా జిల్లా చిన్న అవుటపల్లి సిద్ధార్థ దంత వైద్య కళాశాలకు చెందిన డాక్టర్ సుధా, నాగేశ్వరరావు స్మైల్ ట్రైన్ ఆర్గనేషన్ సహకారంతో 12 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాధిత పిల్లలు మాట్లాడటం, నీరు, ఆహారం తీసుకోవటం, ఏ సమయంలో ఆపరేషన్ చేయించాలని వంటి విషయాలపై చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. శిబిరంలో పల్నాడు జిల్లా ఆర్‌బిఎస్‌కె టీమ్, దంత వైద్య నిపుణులు, మాచర్ల ప్రభుత్వ వైద్యశాల వైద్యులు చారి పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై గుంతలు.. వాహనదార్లకు ప్రమాదాలు

ప్రజాశక్తి- మాచర్ల

రోడ్డు మధ్యలో ఏర్పడిన భారీ గుంతలు వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని రింగ్‌రోడ్డు సెంటర్ నుండి బస్టాండ్ సెంటర్ వరకు కుడి, ఎడమ ఇరు వైపున ఉన్న ప్రధాన రహదారులపై పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. ప్రధానంగా పట్టణ మెయిన్ సెంటర్ అయిన అంబేద్కర్ కూడలి ఇరువైపుల మూల మలుపుల రోడ్లపై గుంతలు ఏర్పాడ్డాయి. బస్టాండ్ సెంటర్ మూలమలపు వద్ద పెద్ద గుంత వున్నది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి మధ్యలో గుంతలు ఉండడంతో అటుగా వెళ్లే వాహనదారులు భయంభయంగా వెళ్లే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో అయితే తమ కష్టాలు వర్ణనాతీతం. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ గుంతల వద్ద ఇప్పటికే ఎన్నో స్వల్ప ప్రమాదాలు జరిగాయి. స్కూటీ గుంతలో పడితే మడ్‌గర్, బంపర్లు ఇరిగిపోతున్నాయి. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరుచేరుతోంది. దాంతో గుంత ఎక్కడ ఉందో, ఎంతో లోతు ఉందో తెలియక వాహదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ గుంతల సమస్య గత కొన్ని నెలలుగా ఇలాగే ఉంటున్నా అధికారులు కేవలం తాత్కాలికంగా మట్టి పోయించి సరిపెడుతు న్నారేగాని పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణం చేయడం లేదని వాహనదార్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ - రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నరసరావుపేటలో ఇటీవల నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పసుపర్రులోని శ్రీ మద్ది కామయ్య జెడ్‌పి పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని హెచ్‌ఎం వై.హనుమంతరావు తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో తమ పాఠశాలకు చెందిన షేక్ పర్వీన్, అండర్-17 విభాగంలో ఎ.శైలు, కె.కవిత, అండర్-19 బాలికల విభాగంలో డి.దైవ కీర్తి, అండర్-19 బాలుర విభాగంలో షేక్ రషీద్, షేక్ సల్మాన్, షేక్ హబీబుల్లా, షేక్ వసీం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో అంబేద్కర్ కోనసీమ జిల్లా మల్కిపురంలో, 4, 5, 6 తేదీల్లో కడప జిల్లా ప్రొద్దుటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. దీంతోపాటు త్వరలో జరిగే హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అండర్-19 బాలుర విభాగంలో తమ పాఠశాల విద్యార్థి పఠాన్ అల్తాఫ్ ఎంపికైనట్లు చెప్పారు. జిల్లా జట్లకు ఎంపికైన విద్యార్థులను ఎస్‌ఎంసి చైర్మన్ కోటా సుదర్శన్‌రావు, వైస్ చైర్మన్ గౌసియా, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు గద్దె హరిబాబు, 15వ వార్డు కౌన్సిలర్ మస్తాన్‌వలి, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజాశక్తి - కారంపూడి

ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో గత శనివారం గుంటూరులోని నల్లపాడు పాలిటెక్నిక్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన జూనియర్ బాల బాలికల పోటీల్లో కారంపూడి మండలం ఒప్పిచర్ల జెడ్‌పి పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. రాయపాటి నాగశ్రీ లక్ష్మి, పాశం శివమణి ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల జట్టుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం విజయ లలిత తెలిపారు. వీరు ఈ నెల 25, 26, 27 తేదీల్లో చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పిఇటి చిన్న రత్తయ్య తెలిపారు.

ప్రజాశక్తి - క్రోసూరు

సోమవారం మందపాడు హైస్కూల్‌లో జరిగిన బేస్‌బాల్ పోటీల్లో క్రోసూరు సెయింట్ ఆన్స్ విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ సిస్టర్ మేరీ రజిత తెలిపారు. అండర్-17లో కె.పూజిత (9వ తరగతి), అండర్-14 విభాగంలో షేక్ ఇష్టత్తానియా (7వ తరగతి), వి.బిందు (8వ తరగతి) ఎంపికైనట్లు చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికవ్వాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు.

న్యాయం కోరుతూ బివిఆర్‌కు ఎసిసి కార్మికుల వినతి

ప్రజాశక్తి-తాడేపల్లి

సుమారు 31 సంవత్సరాల క్రితం అక్రమ లాకౌట్ గురైన ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు సోమవారం గుంటూరు వచ్చిన సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, స్థానిక ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావును కలసి

లక్ష్మణరావుకు వినతి

వినతిపత్రం అందజేశారు. యాజమాన్యం ఇంతవరకు తమకు నష్టపరిహారం ఇవ్వలేదని వారి దృష్టికి తీసుకొచ్చారు. వేలాది కోట్ల రూపాయలు విలువ గలిగిన భూములు ఉన్నా, న్యాయ స్థానాలు, నష్టపరిహారం కార్మికులకు చెల్లించమని ఆదేశించిన యాజమాన్యం మొండివైఖరి అవలంబించిందని అని తెలిపారు. అఖిలపక్ష యూనియన్‌ల ఆధ్వర్యంలో సుదీర్ఘకాలం అనేక పోరాటాలు నిర్వహించిన యాజమాన్యం స్పందించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు 170 మంది కార్మికులు అర్థాకలతో చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు బాగా బతికిన ఫ్యాక్టరీ కార్మికులు నేడు నైపుణ్యం లేని పనులకు వెళ్లి ఇబ్బందులు పడు తున్నారని నాయకుల

గుంటూరులో బివిఆర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎసిసి కార్మికులు

దృష్టికి తీసుకొచ్చారు. యాజమాన్యం మొండివైకిరిని నిరసిస్తూ ఈనెల 27వ తేదీ ఎసిసి భూముల స్వాధీనానికి కార్మికులు వెళ్తున్నట్లు చెప్పారు. అన్ని రాజకీయ పార్టీల ట్రేడ్ యూనియన్లు తమకు మద్దతిస్తున్నట్లు తెలిపారు. న్యాయమైన సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు మద్దతు సంపూర్ణంగా ఇవ్వాలని బివి రాఘవులు, కెఎస్ లక్ష్మణరావులను కోరారు.

ఉండవల్లి సెంటర్లో కొలిక్కి రాని ట్రాఫిక్ కష్టాలు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి సెంటర్లో ప్రతిరోజు ట్రాఫిక్ కష్టాలు తప్పవా అనిఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం అయితే ఉదయం, సాయంత్రం రెండుసార్లు గంటలు తరబడి ట్రాఫిక్ చక్రబంధంలో ప్రజలు చిక్కుకుపోయారు. ఉదయం వేళలో స్కూల్ బస్సులు, విజయవాడ. మంగళగిరి, గుంటూరు, రాజధాని లోని విట్, ఎస్ ఆర్ ఎం, అమృత సాయి తదితర కళాశాలకు, పాఠశాలలకు వెళ్లే బస్సులు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడటంతో సమయానికి పాఠశాలలకు, కళాశాలకు సమయానికి వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు అయితే రోజులు సగ జీతం తగ్గించుకోవలసి వస్తుందనిఅసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు సంస్థల్లో పనిచేసే చిరుద్యోగులు అయితే యజమాలతో తిట్లు తో పాటు జీతం కూడా తేగ్గొస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉండవల్లి నివాసం ఉండటంతో పోలీసులు కూడా ట్రాఫిక్ నిలుపుదల చేయలేని

పరిస్థితి ఏర్పడింది. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తగినంతమంది ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పించాలని కోరుతున్నారు.

బాధితురాలిని పరామర్శిస్తున్న నాయకులు

నిందితుడిని కఠినంగా శిక్షించాలి : సిఐటియు

ప్రజాశక్తి-గుంటూరు

తెనాలిలో ప్రేమ పేరుతో వేధింపులు, దాడికి గురై జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న సహానాను, ఆమె తల్లి అరుణను అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, సిపియం, సిఐటియు నాయకులు మంగళవారం పరామర్శించారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎవిఎన్ కుమారి, ఉపాధ్యక్షులు చిన్న వెంకాయమ్మ, సిపియం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.భావన్నారాయణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు షేక్.హుస్సేన్‌వలి, జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిందితులు ఎంత పెద్ద వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా మహిళలపై దాడులు ఆగట్లేదని, రోజురోజుకూ పెరుగుతున్నాయని అన్నారు. ధైర్యంగా ఉండాలని, బాధితురాలికి అండగా ఉంటామని కుటుంబానికి భరోసా ఇచ్చారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్, తహశీల్దార్

వ్యాపారులతో అధికారుల సమావేశం

ప్రజాశక్తి-తెనాలి :దీపావళి పండుగను పురస్కరించుకొని క్రాకర్స్ వ్యాపారులతో మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ, కమిషనర్ బి శేషన్న సమావేశయ్యారు. క్రాకర్స్ విక్రయించడానికి షాపుల కేటాయింపునకు నిర్దేశించిన మార్గదర్శకాలను, ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజుల వివరాలను వారికి వివరించారు. వ్యాపారులు కచ్చితంగా అనుమతులు పొందాలని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే క్రాకర్స్ విక్రేతలకు షాపులు కేటాయించేందుకు వియస్సార్, జే ఎం జె కళాశాల ప్రాంగణాలను పరిశీలించారు. వారి వెంట రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటు నమోదు

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలం లో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ముమ్మరంగా పట్టభద్రుల ఓటు నమోదు కొనసాగుతుంది. ఓటు నమోదు కొరకు యుటిఎఫ్ కార్యాలయం ఉపాధ్యాయ భవన్ లోని సేవలను ఉపయోగించుకోవచ్చని, జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఉపాధ్యాయులు వారి కుటుంబ సభ్యులు మరియు పట్టభద్రులు అందరూ తమ ఓటును ఆన్లైన్ మరియు ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకొనుటలో అవసరమైన సహకారాన్ని యు.టీ.ఎఫ్ మండల కార్యాలయం అందిస్తుందని చెప్పారు. యు.టీ.ఎఫ్ చేబ్రోలు మండల కమిటీ నిర్వహిస్తున్న కృష్ణ , గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు సహాయ కేంద్రం ద్వారా మంగళవారం వేజెండ్ల, శుద్ధపల్లి గ్రామాల ఉపాధ్యాయులు మరియు కుటుంబ సభ్యులు 100 మంది తమ ఓటును నమోదు చేసుకున్నారని యుటిఎఫ్ మండల కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె. విజయ రాజు, పి పార్థసారథి తెలిపారు. పాలకపక్షాలు ఏవైనా నిరంతరం ప్రజాపక్షం వహించి పట్టభద్రుల ఉద్యోగుల సమస్యలను చట్టసభలలోను ప్రశ్నించడం ద్వారా ప్రతినిధులు చేయడం ద్వారా,చట్టసభల వెలుపల ఉద్యమాల ద్వారాను పరిష్కరించుటకు నిరంతరం కషి చేస్తున్న పి.డి.ఎఫ్ అభ్యర్థిని ఎన్నికలలో బలపరచాలని కోరారు. కార్యక్రమంలో మండల కమిటీ ఉపాధ్యక్షులు ఎం శ్రీనివాసరావు కార్యదర్శులు మొహమ్మద్ ఈసా, సతీష్ చంద్రబాబు, శ్రీనివాసమూర్తి జిల్లా కౌన్సిలర్ షేక్ సైదా పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి అభినందనలు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ లో వ్యాయామ ఉపాధ్యా యులుగా పనిచేస్తున్న కే రాంబాబును పాఠశాల ప్రధానో పాధ్యాయులు భీమిరెడ్డి తాతిరెడ్డి మంగళ వారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల ఐక్య ఉపాధ్యాయ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా జిల్లా స్థాయిలో జరిగిన ఉపాధ్యాయ ఆటల పోటీల్లో 400 మీటర్ల నడక పోటీల్లో మూడో స్థానం సాధించినందుకు'మరియు జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో విన్నర్స్ గా నిలిచినందుకు ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఆటలుపోటీల విజయ వంతం రాంబాబు మాస్టర్ స్వచ్ఛందంగా పాల్గొని తన సేవలు అందించడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోటేశ్వరరావు. అనిల్ కుమార్. ఎస్కే అన్వర్ పాల్గొన్నారు.

వంగవీటి రాధకు లోకేష పరామర్శ

ప్రజా శక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని ప్రాథూరి కర కట్ట పై నివాసం ఉంటున్న విజయవాడ సెంట్రల్ మాజీ ఎమ్మెల్యే వంగవీటి

రాధాకృష్ణను మంగళవారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. ఇటీవల రాధా అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం తాడేపల్లిలోని గెస్ట్ హౌస్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకొని నేరుగా మంత్రి లోకేష్ ఆయన ఇంటికి వెళ్లి రాధా ఆరోగ్య పరిస్థితిని గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసు కున్నారు. రాధా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ గొప్పది

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

ప్రజాశక్తి - తాడికొండ

మాట్లాడుతున్న వెంకయ్య నాయుడు

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ భారతదేశానికి ఉన్న గొప్ప బలమని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంక య్య నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని మోతడకలో సీనియర్ సిటి జన్స్ కంఫర్ట్ హోం ప్రారం భోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతు ఇతర దేశాలకు మనం ఉమ్మడి కుటుంబ వ్యవస్థ గురించి చాటి చెబితే నేడు మనం ఇతర దేశాల పోకడలు పోయి ఉమ్మడి కుటుంబ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నామన్నారు. విదేశాల్లో స్థిరపడ్డ వారి తల్లిదండ్రుల కోసం శ్రీనిలయం హోం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఉద్యోగాలు చేస్తు న్నవారు తమ తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో పెట్టడం బాద కలించే అంశమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వయో వృద్ధుల కోరకు పథకాలు కొనసాగిస్తున్నాయని, ఇంకా మెరుగు పరిచేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తాడికొండ, పెదకూరపాడు ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, భాష్యం ప్రవీణ్, యరపతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు జెడ్‌పి విద్యార్థులు

ప్రజాశక్తి - చేబ్రోలు

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మండలంలోని నారాకోడూరు జడ్‌పిహెచ్ హైస్కూలు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు ఎం ఏడుకొండలు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతు ఈ నెల 26 నుండి 28 వరకు తెనాలిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి అండర్ 14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హ్యాండ్‌బాల్‌టోర్నమెంట్‌లో పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యరని తెలిపారు. 9వ తరగతి నుండి వి హారీషు, వై అనిల్, ఎస్‌కె బషీరు, ఎస్ చార్లెస్ వెస్లీ, ఎస్ జాన్ వెస్లీ, పి క్రాంతి, 8వ తరగతి నుండి పి కార్తీకు ఎంపికయ్యరన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉపాధ్యాయులు బి వెంకటేశ్వరరావు, ఎస్ ఉమామహేశ్వరి, శరత్ కుమార్, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు.

షూటింగ్ బాల్ పోటీలకు ఎస్‌వివి విద్యార్థులు

ప్రజాశక్తి - తాడికొండ

రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ జట్టుకు తాడికొండ వెల్లంకి వెంకటప్పయ్య ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ తెలిపారు.ఎపి ఇంటర్ డిస్ట్రిక సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ షూటింగ్‌బాల్ రాష్ట్ర స్థాయి ఛాంపియన్ షిప్ పోటీలను ఈ నెల 19 నుండి 21 వరకు అనంతపురం జిల్లా నార్పలలో నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు తరపు పాల్గొన్న తమ పాఠశాల విద్యార్థులు రాం ప్రకాష్, ఫయాజ్, ఏడుకొండలు చక్కని క్రీడా ప్రతిభ కనబరచి విశాఖ, చిత్తూరు, నెల్లూరు, అనంతపురం, బాపట్ల జట్లపై విజయం సాధించారని తెలిపారు. గుంటూరు జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరిని ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు సుంకర శ్రీనివాస్, ఛైర్మన్ మోర్కంపూడి రవి తదితరులు సన్మానించారు.

కండ్లకుంటలో ఆధార్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి- వెల్దుర్తి

మండల పరిధిలోని కండ్లకుంట గ్రామపంచాయతీలో ఆధార్ సవరణ కోసం ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ప్రసాదరావు మంగళవారం తెలిపారు. ఆధార్ కార్డు లేకపోతే నూతన ఆధార్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని, ఇప్పటి వరకు తీసుకున్న ఆధార్ కార్డులలో ఏమైనా తప్పులుంటే సవరణ చేయించుకోవాలని సూచించారు. ఈనెల 25వ తేదీ వరకు ఆధార్ కేంద్రం ఉంటుందని, ఈ అవకాశాన్ని మండలంలోని అన్ని పంచాయతీలలో ఉన్న ప్రజలందరూ మారుమూల చెంచు గూడెల్లో ఉన్న గిరిజనులు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డి మకట్లా నాయక్ ఆధార్ సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దుర్తి ఎస్ఐగా సమందర్ వలి

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తి ఎస్ఐగా సమందర్‌వలి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. పల్నాడు జిల్లా ఎస్పీ ఆఫీసులో విధులు నిర్వహించి బదిలీపై వెల్దుర్తి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ఎం.సత్యనారాయణ వినకొండకు బదిలీ అయ్యారు. నూతన ఎస్ఐ మాట్లాడుతూ స్టేషన్‌లో అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని, సమస్యలపై వచ్చిన వారితో స్నేహపూర్వకంగా ఉంటానని చెప్పారు.

'దళిత కార్డు వాడుకోవడం సరికాదు'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గతంలో అసభ్యంగా, అనుచితంగా మాట్లాడిన బోరుగడ్డ అనిల్ అరెస్టు విషయంలో ఆయన భార్య దళిత కార్డు వాడుకోవాలని చూడడం విచారకరమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ ఎం.భానుప్రసాద్ అన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కారన్నారు. గత ప్రభుత్వంలో బోరుగడ్డ అనిల్ మీడియా ముందు ప్రతిపక్ష నాయకులను, వారి కుటుంబీకులను, ముఖ్యంగా మహిళలను ఉద్దేశించి వాడిన పదజాలం ఏ రకంగానూ సమర్థనీయం, క్షమార్హం కాదని చెప్పారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేయించుకోండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంలో అర్హత కలిగిన అందరు ఓటరుగా నమోదు చేయించుకోవాలని టిడిపి నాయకులు కోరారు. సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్లుకు దరఖాస్తు ఫారాలు మంగళవారం అందచేశారు. కార్యక్రమంలో ఎ.జయరాం, ఎం.రామచంద్ర రావు, పి.వెంకట కోటయ్య, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టిఎల్ఎఫ్ అధ్యక్షులుగా వెంకాయమ్మ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేట మొదటి పట్టణ డ్వాక్రా సంఘం టిఎల్ఎఫ్ అధ్యక్షులుగా 20వ వార్డుకు చెందిన బొప్పూడి వెంకాయమ్మను నియమించారు. ఈ మేరకు మంగళవారం టిడిపి కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే అరవిందబాబు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను వెంకాయమ్మ సత్కరించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి ఆర్.పెద్దనాగేశ్వరావు, వి.రవీంద్ర పాల్గొన్నారు.

నోటి మాట ద్వారా విధుల నుండి ఎలా తొలగిస్తారు?

కొనసాగుతున్న ఇంజినీరింగ్ విభాగం, కార్మికులు, ఉద్యోగుల రిలేదీక్షలు - ఎఐఎంఐఎం, గాంధీ స్మారక సమితి సంఘీభావం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఏళ్ల తరబడి అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న కార్మికులు, ఉద్యోగులను నోటి మాటపై విధుల నుండి ఎలా తొలగిస్తారని ఎఐఎంఐఎం నాయకులు, గాంధీ స్మారక సమితి అధ్యక్షులు ప్రభుత్వాన్ని, అధికారులను ప్రశ్నించారు. రాజకీయ వేధింపుల్లో భాగంగా విధుల నుండి తొలగించిన తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నరసరావుపేట మున్సిపాల్టీ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు, ఉద్యోగులు చేపట్టిన ఆందోళన 20 రోజుకు చేరింది. ఇందులో భాగంగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 8వ రోజుకు చేరాయి మంగళవారం దీక్షలను గాంధీ స్మారక సమితి అధ్యక్షులు గోపిచంద్ దీక్షాపరులకు పూల మాల వేసి ప్రారంభించారు. వీడియో కాల్ ద్వారా ఉద్యోగులను, కార్మికులను ఉద్దేశించి ఎఐఎంఐఎం రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ సయాద్ మాట్లాడుతూ ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు నిరంకుశ తీరుపై మండిపడ్డారు. 20 రోజుల నుండి ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. తిరిగి విధుల్లోకి తీసుకునే వరకు చేయాలని, తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. గోపీచంద్ మాట్లాడుతూ చిరు ఉద్యోగులపై రాజకీయ వేధింపుల న్యాయమా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు. పల్నాడు జిల్లా కేంద్రంగా ఆవిర్భవించడం, పెరిగిన పట్టణ విస్తరణను దృష్టిలో పెట్టుకుని ఉద్యోగులను, కార్మికులను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఎఐఎంఐఎం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు షేక్ కరీముల్లా, పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి ఉద్యోగులను కార్మికులను రాజకీయ కోణంలో వేధింపులకు పాల్పడడం తగదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా న్యాయం జరగకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పట్టణంలో రూ.కోట్లతో నిర్మించిన భూగర్భ డ్రెయినేజీ సక్రమంగా పనిచేయక పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. యూనియన్ ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షులు షేక్ చిన్నఅల్లాబక్షు మాట్లాడుతూ తమను విధుల్లోకి తీసుకుని, ఉద్యోగ భద్రత కల్పించి, పెండింగ్ వేతనాలు చెల్లించే వరకూ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సల్మాన్, మల్లయ్య, యోహాన్, బి.నాగమల్లేశ్వరి, ఎస్.రమాదేవి, మహబూబ్ సుభాని, మహబూబ్ బాషా, సైదా, పి.రమణ, ఎ.పద్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

అధికారులతో సమీక్షలో పల్నాడు కలెక్టర్

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మరణాలు సంభవించకుండా అవసరమైన లైటింగ్, స్పీడ్ బ్రేకర్లు, సైనేజ్ బోర్డులు, క్యాట్ ఐస్ ఏర్పాటు చేయాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. రహదారి భద్రత, మాదక ద్రవ్యాల నియంత్రణపై ఎస్‌పి కంచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జంక్షన్లు, హైవే నుండి సర్వీస్ రోడ్లు వద్ద స్పీడ్ బ్రేకర్లు, సైనేజ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి సత్వర చికిత్స అందజేసి మరణాల సంఖ్య తగ్గేలా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలని, ట్రిపుల్ రైడింగ్ లేకుండా చూడాలని చెప్పారు. అధిక లోడ్, ఓవర్ స్పీడ్ నియంత్రించేలా రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖాధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించాలన్నారు. నరసరావుపేట పట్టణంలో పార్కింగ్ స్థల ఏర్పాటుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. రహదారికి ఇరువైపులా ముందుకు వచ్చిన దుకాణాల యజమానులతో మాట్లాడి అడ్డు లేకుండా చూడాలన్నారు. పశువుల యజమానులతో మాట్లాడి వాటి కొమ్ములపై రేడియం స్టిక్కర్లు అంటించేలా చర్యలు చేపట్టాలన్నారు. రహదారుల వెడల్పు, లైటింగ్ ఇతర పనులకు అవసరమైన నిధుల కోసం నివేదించాలని చెప్పారు. మాదక ద్రవ్యాల నిరోధానికి పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు మండలాల వారీగా చేపట్టాల్సిన చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గంజాయి నివారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. డీ- అడిక్షన్ సెంటర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమములో అడిషనల్ ఎస్.పి సంతోష్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, ఆర్‌డిఒలు రమణకాంత్‌రెడ్డి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రాల ద్వారా ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్నామని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.శివలలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని, ఇప్పటి వరకు 250 మెట్రిక్ టన్నుల డిఎపి, 279 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని పేర్కొన్నారు. రొంపిచర్ల జిడిసిఎంఎస్ ద్వారా, సుబ్బయ్యపాలెం పిఎసియస్ ద్వారా 420 మెట్రిక్ టన్నుల యూరియా, 320 మెట్రిక్ టన్నుల డిఎపి, 410 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు రైతులకు సరఫరా చేశామని వివరించారు. ప్రస్తుతం రైతుసేవా కేంద్రాల్లో 220 మెట్రిక్ టన్నుల డిఎపి, 117 మెట్రిక్ యూరియా అందుబాటులో ఉందని తెలిపారు.

అమర జవాన్‌కు పోలీసుల నివాళులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా అమర జవాన్‌కు సత్తెనపల్లి రూరల్ పోలీసులు నివాళులర్పించారు. సత్తెనపల్లి మండలం గుడిపూడిలో అమర జవాన్ శాఖమూరి మురళీకృష్ణ విగ్రహానికి రూరల్ సిఐ పి.శ్రీనివాసరావు, ఎస్ఐ షేక్ అమిరుద్దీన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అమర్ జవాన్ త్యాగాలను స్మరించుకున్నారు.

వైసిపి హయాంలో దేవాలయాల ఆస్తులు కబ్జా : ఎమ్మెల్యే జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని విఠంరాజుపల్లి శాంతి ఆశ్రమంలో మంగళవారం సకల సాంస్కృతిక కళాకారుల, గురువుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం జరిగింది. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, డాక్టర్ గజల్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని మతాల్నిను గౌరవించడం కూడా సనాతన ధర్మమేనన్నారు. వైసిపి పాలనలో దేవాలయాలపై దాడులు జరిగినా, రథాలను తగులబెట్టినా పట్టించుకోని వారంతా అడ్రస్ లేకుండా పోయారన్నారు. వైసిపి హయాంలో వందల కోట్ల విలువైన దేవాలయాల ఆస్తులను కబ్జా చేశారని మండిపడ్డారు. అన్ని కులాలు, మతాల మధ్య ఐక్యత ఉండాలన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కె.నాగశ్రీను రాయల్, బిజెపి నాయకులు ఎం.రమేష్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 32 అర్జీలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

భూ రీసర్వేపై మండలంలోని గారపాడులో మంగళవారం గ్రామసభ జరిగింది. తహశీల్దార్ దానియేలు మాట్లాడుతూ భూ సమస్యలపై 32 దరఖాస్తులు వచ్చాయని, వీటిని పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అందుకు ఆధారాలు, వివరాలు ఉండాలన్నారు.

ప్రజాశక్తి - క్రోసూరు

మండల పరిధిలోని పీసపాడు, పారుపల్లి గ్రామాల్లో డిటి చింక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించారు. పీసపాడులో రెవిన్యూ అర్జీలు 13 , సర్వే కొలతలకు 7 అర్జీలు అందాయి. పారుపల్లిలో 5 అర్జీలు వచ్చాయి. మండల సర్వేయర్ పి.శ్రీధర్, విఆర్వో రామచంద్రరావు, గ్రామ సర్వేయర్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఒంగోలులో హేతువాద సంఘం సభలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

హేతువాద సంఘం మహాసభలను నవంబర్ 9 10 తేదీలలో ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో నిర్వహిస్తున్నట్టు ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య తెలిపారు. అరండల్‌పేటలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్, పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు ముప్పాళ్ళ సుబ్బారావు, జెవి కృష్ణయ్య పాల్గొంటారని వివరించారు. ఏ దేశం అభివృద్ధి చెందాలన్నా ఆ దేశంలో మూఢనమ్మకాలు తక్కువగా ఉండాలని తెలిపారు. మన దేశంలో పాలకులు తరతరాలుగా వస్తున్న సాంప్రదాయాలు ఆచారాలను మూఢాచారాలు చాంధసత్వం వైపుగా తీసుకొని పోతున్నారని విమర్శించారు. వైద్య శాస్త్రం చదువుకున్న మేధావులైన డాక్టర్లు కూడా మృత్యుంజయ యాగాలు చేయడం బాధాకరమన్నారు. ఇప్పటికే కొన్ని యూనివర్సిటీలలో వాస్తు జ్యోతిషాలను కోర్సులుగా పెట్టి విద్యార్థులకు డిగ్రీలు ఇవ్వడం దారుణమన్నారు. ప్రశ్నించే తత్వం, శాస్త్రీయ ఆలోచన, మానవ వాదాన్ని పెంచడం రాజ్యాంగ ఆర్టికల్ 51 ఎ(హెచ్)ను నేటి పాలకులు తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో హేతువాద సంఘ నాయకులు జి.సదాశివరావు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షులు బి.విల్సన్, ఎఫ్ గోపాలరావు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘం సభ్యురాలికి మెప్మా అభినందన

సయ్యద్ నహరే నిగర్ సుల్తానాను అభినందిస్తున్న మెప్మా మిషన్ డైరెక్టర్

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన స్వయం సహాయక సంఘం సభ్యురాలిని మెప్మా మిషన్ డైరెక్టర్ అభినందించారు. మున్సిపల్ కమిషనర్ బి శేషన్న తెలిపిన వివరాల ప్రకారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబనకు ఈనెల 10నుంచి 20 తేదీ వరకు విజయనగరంలో అఖిల భారత సరస్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ఆంధ్ర ప్రదేశ్ నుండి మెప్మా ద్వారా 28 స్టాల్స్‌లో 47 స్వయం సహాయక సంఘ సభ్యులు తాము తయారు చేసిన ఉత్పత్తులతో పాల్గొన్నారు. ప్రదర్శనతో పాటు అమ్మకాలను నిర్వహించారు. మెప్మా స్వయం సహాయక సంఘ సభ్యుల ఉత్పత్తులు రూ.45,73,857 మేర అమ్మకాలు జరిగాయని, తద్వారా రూ.9,14,771 లాభించినట్లు చెప్పారు. అయితే పట్టణానికి చెందిన సయ్యద్ నహరే నిగర్ సుల్తానా, శుభానల్లా స్వయం సహాయక సంఘ సభ్యురాలు తయారు చేసిన క్రిస్టల్ బ్యాగ్, ఆర్టిఫీషియల్ జ్యూయలరీ ఉత్పత్తుల ద్వారా రూ.2,67,000 అమ్మకాలు చేసిందని, ఎగ్జిబిషన్లో పాల్గొన్న అన్ని గ్రూపుల సభ్యుల కంటే ఎక్కువ మొత్తంలో విక్రయించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్ తేజ్ భరత్ మెప్మా ప్రధాన కార్యాలయానికి సయ్యద్ నహరే నగర్‌ను పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు. ఆమెతో పాటు పనిచేసే గ్రూప్ సభ్యులందరికి కలిపి ఒక గ్రూప్ యూనిట్ ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిస్తామని హామీనిచ్చినట్లు కమిషనర్ వెల్లడించారు. మెప్మా మిషన్ కమిషనర్ ప్రశంసలు అందుకున్న సయ్యద్ నహరే నిగర్ సుల్తానాను కమిషనర్ బి శేషన్నతో పాటు మున్సిపల్ సిబ్బంది, మెప్మా విభాగం అభినందించింది.

విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న తహాశీల్దార్

రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన తహాశీల్దార్

ప్రజాశక్తి - దుగ్గిరాల

రీ సర్వేలో అవకతవకలు జరిగినట్లయితే వాటిని పై స్థాయి అధికారులకు తెలియపరచి రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసిల్దార్ ఐ సునీత తెలిపారు. రీ సర్వే జరిగిన గ్రామాలలో నిర్వహిస్తున్న గ్రామ సభల్లో భాగంగా మంగళవారం దేవులపల్లి అగ్రహారంలో గ్రామసభను నిర్వహించారు. గ్రామాలలో భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలనే ప్రాథమిక లక్ష్యంతో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతుల నుండి తమ భూములకు సంబంధించిన పది ఫిర్యాదులు వచ్చినట్లు ఆమె తెలిపారు. గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్ ఈ త్రివేణి, వీఆర్వోలు జై కాంత్ అనిల్ వర్మ తదితరులు పాల్గొన్నారు. బుధవారం చింతలపూడి గ్రామంలో, గురువారం శృంగారపురం, శుక్రవారం చిన్నపాలెం, శనివారం మోరంపూడి 29వ తేదీ మంగళవారం తుమ్మపూడి 30 వ తేదీ బుధవారం కంఠంరాజు కొండూరులో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహాశీల్దార్ తెలిపారు.

దుగ్గిరాల అలీనగర్లో సర్వే నిర్వహిస్తున్న అధికార యంత్రాంగం

సమీప పంచాయతీలో కలపండి

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించేందుకు అధికారులు ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహిస్తున్నారు. దుగ్గిరాల గ్రామ పంచయతీలోని కొంత భాగం దేవులపల్లి అగ్రహారం తెనాలి రూరల్ మండల గ్రామం కొలకలూరు సమీపంలో ఉన్నది. కొలుకలూరు గ్రామ పంచాయతీలోని కొంత భాగం దుగ్గిరాల గ్రామంలోని అలినగర్లో ఉంది. అలీనగర్ వాసులు పంచాయతీకి సంబంధించిన ప్రతి పనికి కొలకలూరు, డిపి అగ్రహారం వాసులు దుగ్గిరాలకు రావాల్సి ఉంటుంది. ఈ రెండు శివార్ల మధ్య దూరం దాదాపు నాలుగు కిలోమీటర్లు. దీనితో అలీనగర్ లోని భాగాన్ని దుగ్గిరాల పంచాయతీలో కలుపమని అనేకసార్లు ప్రభుత్వ అధికారులకు ప్రజా ప్రతినిధులకు విన్నయించుకొన్నారు. దీనితో మంగళవారం డిపిఎల్ఓ స్వరూప రాణి దుగ్గిరాల గ్రామ కార్యదర్శి కె వివేకానంద మరియు కొలకలూరు పంచాయతీ సిబ్బంది అలీనగర్లో ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించి ప్రజల అభిప్రాయాలను సేకరించారు. వారందరూ అలినగ ర్ లోని భాగాన్ని దుగ్గిరాల పంచాయతీలో కలపవలసిందిగా తమ అభిప్రాయాన్ని తెలిపారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి-తాడేపల్లి

టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందర్ రావ్ యాదవ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఒక ప్రకటనలో మంగళ వారం కృతజ్ఞతలు తెలిపారు. తాడేపల్లి కి చెందిన సుందర్ రావు ఇటీవల కిడ్నీ సంబంధిత వ్యాధులకి గురయ్యారు. కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ కు తన కుఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన సీఎం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేశారు. స్థానిక మణిపాల్ ఆస్పత్రిలో కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ అనంతరం సుందర్ రావు ఆరోగ్యంగా ఉన్నారు. ఆ వెరకు ఆయనతోపాటు కుటుంబ సభ్యులు కూడా సీఎంకు కృతజ్ఞతలు తెలి పారు.

ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించండి

ప్రజాశక్తి - దుగ్గిరాల

ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిపిఓ మరియు మండల ప్రత్యేక అధికారి సాయికుమార్ మండల స్థాయి అధికారులను కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రస్తుతం జరుగుతున్న అభివద్ధి పనులు మరియు చేపట్టవలసిన పనులను గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు ఈవో పీఆర్డి జవహర్లాల్ నెహ్రూ పంచాయతీరాజ్ ఏఈ గోవర్ధన్ హౌసింగ్ ఏఈ సుబ్బారావు వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డిపిఒ


భూ సమస్యలపై వివరాలు తెలుసుకుంటున్న డిటి షేక్ కరీముల్లా

గ్రామసభల్లో భూ రీ సర్వే సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి,పెదనందిపాడు

భూ రీ సర్వేలో రైతులకు ఎదురైన భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని మండల డిప్యూటీ తహసీల్దార్ షేక్ కరీముల్లా అన్నారు. మండల పరిధిలోని రాజుపాలెం రెవెన్యూ గ్రామసభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రీ సర్వే సమస్యలపై రైతుల నుండి అర్జీలు స్వీకరించారు. పలువురు రైతులు వారి సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎనిమిది మంది రైతులు సమస్యలపై అర్జీలు ఇచ్చారు. వాటిలో ఎక్కువగా విస్తీర్ణం కొలతలలో తేడాలు ఉన్నట్లుగా రైతులు చెప్పారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రావిపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహణ

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలోని రావిపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం మండల వ్యవసాయ అధికారిని బి సుధారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రత్తి పంటను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం పత్తిని ఆశిస్తున్న రసం పీల్చు పురుగుల నివారణ చర్యలు, గులాబీ రంగు, కాయ తొలుచు పురుగు నివారణకు, లింగాకర్షక బుట్టలు, తెల్ల దోమ నివారణకు పసుపు రంగు జిగురు పూసిన అట్టలు పొలంలో అమర్చుకోవాలని తెలియజేశారు. అలాగే సేంద్రియ పద్ధతిలో ద్రవ జీవామతం తయారు చేయు విధానం వివరించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించి వివిధ ప్రభుత్వ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రావిపాడులో రైతులతో మాట్లాడుతున్న ఎఒ సుధారాణి

మాట్లాడుతున్న డొక్కా మాణిక్యవరప్రసాద్

నిరుపేదల పక్షపాతి శంకరన్

మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ ఐఏఎస్ అధికారి శంకరన్ నిరుపేదల పక్షపాతి అని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం అరండల్ పేటలోని అమరావతి బుక్ హౌస్‌లో ఎస్ ఆర్ శంకరన్ 92వ జయంతి సభ జరిగింది. ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షులు బత్తుల కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. తొలుత ఎస్ఆర్ శంకరన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ దేశంలోనే ఉన్నత సర్వీసు ఐఏఎస్ అధికారిగా ఎస్సీ ఎస్టీల కోసం పని చేస్తూ ఆజన్మాంతం బ్రహ్మచారిగా సాధారణ జీవితం గడిపిన ఎస్.ఆర్.శంకరన్ జీవితం అసాధారణమైందన్నారు. నేటి తరం ఐఏఎస్ లు ఎస్ ఆర్ శంకరన్ ను ఆదర్శంగా తీసుకొని ప్రజలకు సేవ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ఎస్ ఆర్ శంకరన్‌తో కలిసి పని చేసే అవకాశం తనకు దక్కినందుకు గర్వంగా ఉందన్నారు. సామాజిక స్ఫూర్తి, నిజాయితీని గుర్తించి త్రిపుర రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించిందని తెలిపారు. విపికె పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె.జయసుధ, మాజీ ఏజిపి రాజారావు , సముద్రాల కోటేశ్వరరావు, గాయకులు జెట్టి బాబురావు, యెనుబరి చంద్రపాల్, దాసరి జాన్ బాబు, మాదా రాధా తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిడిఒచందన

అంగన్వాడీ కేంద్రంలో ఎంపిడిఒ తనిఖీ

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని డోకిపర్రు అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం మేడికొండూరు ఎంపీడీవో తోట చందన ఆకస్మిక తనిఖీ చేశారు. కిశోర బాలికలకు ప్రభుత్వ నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారం వండుతున్నారా లేదా అని పరిశీలించారు. వండిన వంటను క్వాలిటీ పరిశీలించారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడి సకాలంలో పోషకాహార కిట్ అందజేస్తున్నారా లేదా అని తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీవో చందన మాట్లాడుతూ డోకిపర్రు బీసీ అంగన్‌వాడీ కేంద్రానికి రూ.10 వేల తో పోషణ వాటిక, రూ. రూ16 వేల తో వర్షపు నీటి నిల్వ నిర్మాణాలు, రూ. 17 వేల రూపాయలతో తాగునీటి కనెక్షన్‌లు మంజూరు అయినట్లు ఆమె తెలిపారు. గర్భిణులకు, చిన్నపిల్లలకు పోషకాహారాన్ని అందించేందుకు ప్రభుత్వ లక్ష్యాన్ని అంగన్వాడి వాడి సిబ్బంది నెరవేర్చాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో సివిల్ సర్వీసు ఉద్యోగులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలోని ప్రభుత్వ సివిల్ సర్వీసు ఉద్యోగులకు ఈనెల 29, 30వ తేదీల్లో గుంటూరు బి.ఆర్ స్టేడియంలో వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటిరోజు అథ్లెటిక్స్, బాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, బెస్ట్ ఫిజిక్ పోటీలు ఉంటాయన్నారు. రెండో రోజు హాకీ, కబడ్డీ, టెన్నిస్, పవర్‌లిఫ్టింగ్, వెయిట్‌లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, రెస్టింగ్, స్విమ్మింగ్, మ్యూజిక్, డ్యాన్స్, షార్ట్‌ప్లే క్రీడలు ఉంటాయని తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని నవంబర్ 6 నుండి 9వ వరకూ జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయటం జరుగుతుందన్నారు. కావున జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనే వారు ఆయా తేదీలలో సంబంధిత డిపార్ట్‌మెంట్ ఐడి ప్రూఫ్‌తో బి.ఆర్ స్టేడియంలో ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. జిల్లాలోని సివిల్ సర్వీసు క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర సమాచారం కోసం 9441818491 నంబరులో సంప్రదించాలన్నారు.

సాంబశివరావును సత్కరిస్తున్న హెచ్‌ఎం ఖాసిం, ఉపాధ్యాయులు

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఫైన్‌ఆర్ట్స్‌లో డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయులు కె.వి.సాంబశివరావు ఫైన్ ఆర్ట్స్‌లో డాక్టరేట్ పొందారు. అమెరికాలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ డెలవరే నుండి పొందిన డాక్టరేట్‌ను ఇటీవల పాండిచ్చేరిలో అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో సాంబశివరావుకు ఉపాధ్యాయులు అభినందన సభ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్.యండి.ఖాసిం అధ్యక్షత వహించి మాట్లాడుతూ సాంబశివరావు ప్రభుత్వ డ్రాయింగ్ ఉపాధ్యాయుడిగానే కాక ప్రభుత్వ పాఠ్యపుస్తకాలలో పాఠ్యాంశాలకు అవసరమైన చిత్రాలు గీస్తారన్నారు. బాపు వంటి గొప్ప వారు అందుకున్న డాక్టరేట్‌ను నేడు సాంబశివరావు అందుకోవటం పాఠశాలకు గర్వకారణం అన్నారు. ఆయన సేవలను, నైపుణ్యాన్ని గుర్తించి గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ఈ డాక్టరేట్ ఇచ్చిందన్నారు. అనంతరం సాంబశివరావును శాలువా, బొకేతో సత్కరించారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఉద్యోగుల్ని రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసుకునేలా ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని ఉద్యోగులు గుంటూరు తూర్పు ఎమ్మెల్సీ నసీర్‌ను కోరారు. ఈమేరకు ఉద్యోగులు మంగళవారం ఎమ్మెల్యే నసీర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇటీవల మణిపూర్ రాష్ట్రంలో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఉద్యోగులను రెగ్యులర్ చేసిన పత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని, అవసరం అయితే రానున్న అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడతానని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా జనరల్ సెక్రెటరీ మొహమ్మద్ ఆలి, ముస్తఫా, మేరీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నసీర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగ నాయకులు

విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఇన్నోవేషన్‌లో మలినేని విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

మలినేని లక్ష్మయ్య ఇంజినీరింగ్ కాలేజీలో సియస్ఈ మూడో సంవత్సరం విద్యార్థినులు వివిఐటి కాలేజీలో జరుగుతున్న ఇన్నోవేషన్ -2024 కార్యక్రమంలో పాల్గొని బహుమతులు సాధించినట్లు మలినేని సంస్థల అధినేత డాక్టర్ యం.పెరుమాళ్లు తెలిపారు. ఇన్వెన్షన్ త్రూ ఇన్నోవేషన్‌లో టి.శ్రీలక్ష్మి, కౌశల్య, బి.సుజాత, కె.పల్లవికి ప్రథమ బహుమతి, పి.హేను సహస్ర, పి.మాల్య, పి.వర్షిత, పి.భావనలకు తృతీయ బహుమతి లభించింది. ప్రోటోవిజన్‌లో ఎస్.మేఘనకు తృతీయ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా విజేతలను డాక్టర్ మలినేని పెరుమాళ్లు, ప్రిన్సిపాల్ జె.అప్పారావు, సియస్ఈ హెడ్ జి.రామస్వామి, ఇతర విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూఢిల్లీలోని వర్క్‌షాప్‌లో పాల్గొన్న కమిషనర్ పులి శ్రీనివాసులు

అర్బన్ ల్యాండ్ సర్వే వర్క్‌షాప్‌లో పాల్గొన్న కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

అర్బన్ ల్యాండ్ రికార్డ్ సర్వే- రీ సర్వే కోసం ఆధునిక సాంకేతిక విధానాల అమలుపై ఈ నెల 21, 22 తేదీల్లో న్యూ డిల్లీలోని అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన అంతర్జాతీయ వర్క్‌షాప్ విజయవంతంగా జరిగిందని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు.నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్ - పట్టణ నివాసాల ఆధారిత భూమి సర్వే (నీూఖూనాూ)లో భాగంగా ఆంధ్రప్రదేశ్ లో ఎంపికైన కుప్పం, మంగళగిరి-తాడేపల్లి, గుంటూరు, ఒంగోలు, ఏలూరు, కాకినాడ, తిరుపతి, అనంతరపురం మునిసిపాలిటీలు, కార్పోరేషన్ల కమిషనర్లు, రాష్ట్ర డైరెక్టర్ సర్వే, సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రికేష్ బి.లత్కర్ పాల్గొన్నారన్నారు. వర్క్ షాప్ లో వివిధ దేశాల, రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొని ఆయా ప్రాంతాల్లో పట్టణాల్లో జరుగుతున్న భూ సర్వే, రీ సర్వే విధానాలను కూలంకషంగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారన్నారు. ముఖ్యంగా సర్వే విధానంలో అత్యాధునిక డ్రోన్‌లు, జిఐఎస్ సాంకేతికల వినియోగం ద్వారా, రికార్డులు భద్రపరచడం వంటి అంశాలాను ఉదాహరణలతో చర్చించడం జరిగిందన్నారు.

రేపటి నుండి వర్సిటీలో యువజనోత్సవాలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల యువజనోత్సవాలు వర్సిటీ వేదికగా ఉత్సాహపూరిత వాతావరణంలో ఈనెల 24, 25, 26 తేదీలలో జరగనున్నాయి. ఈ మేరకు వర్సిటీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంతో ఉత్సాహంగా నిర్వహించే ఈ యువజన ఉత్సవాల్లో వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల విద్యార్థులు ఈ యువజన ఉత్సవాలలో భాగస్వాములై తమ ప్రదర్శనలను ప్రదర్శించనున్నారు. మొదటి రోజు మ్యూజిక్ విభాగంలో క్లాసికల్ ఇన్స్ట్రుమెంట్ సోలో, ఫోక్ ఆర్కెస్ట్రా , వెస్టర్న్ లోకల్ సోలో, గ్రూప్ సాంగ్ పోటీలు, మిమిక్రీ, మైమ్, ఫైన్ ఆర్ట్స్ విభాగంలో స్పాట్ పెయింటింగ్, పోస్టర్ మేకింగ్, క్లాసికల్ డాన్స్ క్విజ్ పోటీలను నిర్వహించనున్నారు. 25న మ్యూజిక్ విభాగంలో క్లాసికల్ వోకల్ సోలో (హిందుస్తానీ, కర్ణాటక), లైట్ ఓకల్ సోలో, గ్రూప్ సాంగ్స్, డిబేట్, క్విజ్ పోటీలు, ఫైనాన్స్ విభాగంలో కొల్లేజ్, క్లే మోడలింగ్, ఇన్స్టాలేషన్, మెహందీ పోటీలను నిర్వహించనున్నారు. 26న ఫోక్ ట్రైబల్ డాన్స్ స్కిట్స్ ఎలక్యూషన్ రంగోలి కార్ట్ బోనింగ్, స్పాట్ ఫోటోగ్రఫీ వంటి పోటీలను నిర్వహించనున్నారు. 26న విజేతలకు బహుమతి ప్రధానోత్సవం చేయనున్నామని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా భ్రమర టౌన్‌షిప్స్ 9వ వార్షికోత్సవాలు

ప్రజాశక్తి - గుంటూరు

నిర్మాణ రంగంలో కొత్తదనం సృష్టించాలనే ఆశయంతో, 2015 సంవత్సరంలో ప్రారంభించిన శ్రీ భ్రమర టౌన్ షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ 9వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొమ్మిది వేల మందికి పైగా కుటుంబాల సొంతింటి కల నెరవేర్చి, కృష్ణ, గుంటూరు, ఎన్‌టిఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో 30కి పైగా అత్యద్భుతమైన ప్రాజెక్టులను అభివృద్ధి పరచి, స్థిరాస్తి రంగంలో తమదైన ముద్ర వేసుకుంది. 8 ఏళ్ళ సుస్థిర ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని 9వ ఏట అడుగుపెట్టిన సందర్భంగా శ్రీ భ్రమర వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. గుంటూరులోని సిద్ధార్ధ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించిన ఈ వార్షికోత్సవ వేడుకల కార్యక్రమాన్ని శ్రీ భ్రమర హౌసింగ్ చైర్మన్ అండ్ మేనేజింగ్

డైరెక్టర్ గళ్ళా రామచంద్ర రావు ప్రారంభించగా, సంస్థ డైరెక్టర్లు మారం చంద్ర శేఖర్, ఎం.ఎస్ రాజు, ఎం.పి.కె లక్ష్మీపతి రాజు, శైలారెడ్డి కోట, యడ్లపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణ మొదలగు వారితో పాటు కాకర్ల సతీష్, కమ్మ రవి తదితరులు పాల్గొన్నారు. శ్రీ భ్రమర హౌసింగ్ చైర్మన్ డాక్టర్ మేనేజింగ్ డైరెక్టర్ గళ్ళా రామచంద్ర రావు మాట్లాడుతూ, 'ఆధునికతలతో, అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న నేటి సమాజానికి విలాసవంతమైన జీవన శైలిని అందించడంతో పాటు, భారతరత్న డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం కల ' (పూర్ ప్రొవిజన్ ఆఫ్ అర్బన్ అమెనిటీస్ టు రూరల్ ఏరియాస్) ను స్ఫూర్తిగా తీసుకుని, గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఆధునిక సౌకర్యాలు, వసతులతో కూడిన ప్రాజెక్టులు చేపట్టడం ద్వారా, గ్రామీణ, నగర జీవనశైలిని సమతుల్యం చేయడానికి శ్రీ భ్రమర కృషి చేస్తుంది' అన్నారు. శ్రీ భ్రమర దిగ్విజయ ప్రస్థానంలో సహకారం, ప్రోత్సాహం అందించిన కస్టమర్లకు, మార్కెటింగ్ మిత్రులకు, శ్రేయోభిలాషులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు నిపుణ్ భారత్ శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

నూతన విద్యా విధానం -2020లో భాగంగా నిపుణ్‌భారత్‌కు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో 1, 2వ తరగతి బోధించే ఉపాధ్యాయులకు పెదప రిమిలోని మొవ్వ చిన బాపిరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్‌లో ప్రారంభమైన ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. మొదటి రోజు సోమవారం పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.లింగేశ్వరరెడ్డి, డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్.సలీంభాషా, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి పాల్గొన్నారు. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ సందర్శించారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాల నుండి 192 మంది ఉపాధ్యాయులు శిక్షణకు హాజరయ్యారు. ప్రారంభమయ్యాయి. విద్యార్దులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ శిక్షణ ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగ పడుతుందని ఆర్‌జెడి లింగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. డిఇఒ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈశిక్షణా కార్యాక్రమాన్ని సాల్ట్

మాట్లాడుతున్న ఆర్‌జెడి లింగేశ్వరరెడ్డి

ప్రోగ్రాం డైరెక్టర్ సురేష్, ప్రథమ్ కాంటెంట్ లీలా పద్మలత ఆకస్మికంగా సందర్శించారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను తుళ్ళూరు, తాడికొండ మండల విద్యాశాఖాదికారులు, సమగ్ర శిక్షా ఏఎంఒ జయశంకర్ ప్రథమ్ టీం పర్యవేక్షిస్తున్నారు.